క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి



పాఠశాల సమీపంలో ప్రమాద స్థలాన్ని చూపుతున్న గ్రామస్తులు

సత్యవేడు : మండలంలోని చెన్నేరి పాఠశాల సమీపంలోని సత్యవేడు- దాసుకుప్పం రోడ్డుపై వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని అడ్వకేట్ లోకేసులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామ పరిధిలోని గిరిజనులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతేడాది పాఠశాల మలుపు వద్ద నాలుగు ప్రమాదాలు జరిగాయన్నారు. చెన్నేరిలోని విద్యార్థులు పాఠశాలకు రోజు రోడ్డు దాటి వెళ్లాల్సి ఉంది. రోజూ విద్యార్థులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సత్యవేడు- తిరుపతి రోడ్డు మార్గం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులకు ప్రాణాపాయం కలగకముందే ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులు చొరవతో పాఠశాల సమీపంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బాల్ రెడ్డి, గిరిజన నాయకుడు దేశయ్య, కృష్ణవేణి, వెంకటమ్మ, సులోచన, గోవిందమ్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న జానకి కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట పట్టణానికి చెందిన ఎస్.జానకి వర్ధంతి సందర్భంగా గురువారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం కూడలిలో వారి కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. సుమారు 150 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్.రాజశేఖర్, ఎస్.పవన్ కళ్యాణ్,ఎస్ సరస్వతి, తిరుపాకరన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్యం వస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. గురువారం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంప్లెం యూత్ ఆధ్వర్యంలో 30 జట్లు పాల్గొనే వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. టోర్నమెంట్ విజేతలకు నగదు బహుమతి అందజేస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, కార్తీక్‌నాయుడు, దయాకర్‌నాయుడు, మునిచంద్రానాయుడు, జనార్ధన్, వీరరాఘవులు పాల్గొన్నారు.

నేడు కుంభాభిషేకం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా గిరి ప్రదక్షిణ మార్గంలోని శ్రీఅన్నపూర్ణ సమేత హరహరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల లోపు ఈ పూజలు జరుగుతాయన్నారు.

నష్టాల ఘాటు



ప్రకృతి వైపరీత్యం, తెగుళ్ల బెడద మిరప రైతుల పాలిట శాపంగా మారింది. పెరిగిన పెట్టుబడులకు తోడు చీడ పీడల దాడితో మిర్చి సాగు తలకు మించిన భారం అవుతోంది. గతేడాది పండిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించడంతో చాలా మంది రైతులు లాభాల ఆశతో ఈ ఏడాది అధికంగా పంటను సాగు చేశారు. ఈ ఏడు తెగుళ్ల ఉధృతి కారణంగా పంట గిడసబారింది. ఎన్ని మందులు వాడిన ఫలితం లేదని కర్షకులు కన్నీరు పెడుతున్నారు. పెట్టుబడులు చేతికందే పరిస్థితి లేదని సత్యవేడు నియోజకవర్గంలోని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

- మిరప పంటకు తెగుళ్ల బెడద
- రూ.లక్షల్లో పంట పెట్టుబడులు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- తుపాన్ దెబ్బతో అన్నదాత కుదేలు



తెగులు సోకిన మిరప మొక్కలు

బుచ్చినాయుడుకండ్రిగ : పలు గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటకు తెగుళ్లు సోకడంతో అన్నదాతలు కుదేలవుతున్నారు. మండలంలోని గాజులపెళ్లూరు, బుచ్చినాయుడుకండ్రిగ, జీఎన్‌కండ్రిగ, తహానగర్, కాంపాళెం, నీర్పాకోట, కుక్కంబాకం, కారణి, వెస్టువరత్తూరు, కొత్తకండ్రిగ, కంచనపుత్తూరు, కరకంబట్టు, నెరిణికండ్రిగ, వీయస్‌పురం, పూసలపల్లి, చిన్నయగుంట గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. నవంబరు, డిసెంబరు నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వచ్చిన తుపాన్ నేపథ్యంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఆరుతడి పంటలైన మిరప పంట దెబ్బతింది.

వాతావరణ మార్పులు

తుపాన్ ప్రభావంతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పులతో మిర్చి పంటకు బొబ్బర, కొమ్ము, బూడిద తెగులు సోకి పంట గిడుసు బారింది. ఏ తెగుళ్లకు ఏ రకం మందులు పిచికారీ చేయాలో తెలియక రైతులు తంటాలు పడుతున్నారు. పంట తెగుళ్ల నివారణకు రైతులు వేలకు వేలు ఖర్చు చేసుకుని క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. ఇంత ఖర్చు పెడుతున్నా తెగుళ్లు తగ్గకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఎకరా మిర్చి పంట సాగు చేయడానికి లక్ష రూపాయలు ఖర్చు అవుతోంది. ఎకరా నారు, ఎరువులు, పొలాల దుక్కిలు, కూలీలు వగైరాలతో పాటు తెగుళ్ల నివారణ కోసం కొనుగోలు చేస్తున్న క్రిమి సంహారక మందులకే ఎక్కువగా ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు.

లాభాల ఆశతో సాగు

రెండేళ్లుగా తెగుళ్ల తక్కువగా ఉండటంతో దిగుబడి పెరిగి ఆదాయం వచ్చింది.ఈ ఏడాది అదే రకంగా లాభాలు వస్తాయని ఆశించి మిర్చి పంటపై మొగ్గు చూపామని, అయితే ఈ సారి అప్పులు మిగులుతున్నాయని వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తెగుళ్లపాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కాపుకు వచ్చే సమయానికి తెగుళ్లు సోకి భారీ మొత్తంలో నష్టపోవాల్సి వస్తోందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుతడి పంటలు సాగు చేయాలని ప్రభుత్వం చెబుతున్నా పంటలకు ఎలాంటి రాయితీలు ఇవ్వడంలేదని, ఒట్టి మాటలుగానే మిగిలిపోతున్నాయని రైతులు అంటున్నారు. ప్రభుత్వం తెగుళ్లతో నష్టపోతున్న మిర్చి రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మిరపకు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెట్టుబడులు రావడం లేదు



ఈ ఏడాది రెండెకరాల్లో మిర్చి పంట సాగుచేశా. పంట సాగు, మందులకు రూ.2 లక్షలు ఖర్చు అయింది. రెండేళ్లుగా మంచి దిగుబడులు వచ్చాయి. దీంతో పాటు మంచి ధర లభించింది. ఈ ఏడాది లాభాలు వస్తాయని మరోసారి మిర్చి పంట సాగు చేశా. తుపాన్‌ల ప్రభావంతో తెగుళ్ల సోకి నష్టాలు చేకూరాయి. పంటకు పెట్టిన పెట్టుబడులు రావడం లేదు.

- కృష్ణారెడ్డి, మిర్చి రైతు, బుచ్చినాయుడుకండ్రిగ

ఖర్చులు రెండింతలు పెరిగాయి



వాతావరణ మార్పుల కారణంగా తెగుళ్లు విపరీతంగా సోకి మిరప మొక్కలు గిడుసుబారాయి. క్రిమి కీటకాలు సోకడంతో పెట్టుబడి ఖర్చు రెండింతలయింది. ఈ ఏడాది లాభాల కంటే భారీ నష్టం వచ్చే అవకాశం ఉంది. ఎంతో ఆశతో సాగు చేశా. కుటుంబం మొత్తం పొలంలో పనిచేశాం.కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాలేదు.

- కాటయ్య, పూసలపల్లి, మిర్చి రైతు

మందులతో తెగుళ్ల నివారణ



మిర్చి పంటలో వివిధ రకాల తెగుళ్లు సోకాయి. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులుకు కాపర్ ఆక్సీ క్లోరైడ్, ఫైటోఫ్తరా ఆకుమచ్చ తెగులుకు డైమిథోమార్ఫ్, మాంకోజెబ్, మొక్క ఎండు తెగులుకు కాపర్ ఆక్సీ క్లోరైడ్, బూడిద తెగులు మెక్లో బ్యుటానిల్, కొమ్మ ఎండు, కాయకుళ్ల తెగులుకు కాపర్ ఆక్సీ క్లోరైడ్, మెటిరమ్ కలిపి పిచికారీ చేస్తే తెగుళ్ల తగ్గుముఖం పడతాయి.

- యామిని, ఉద్యానవన శాఖాధికారిణి

మునస్వామి సేవలు మరువలేం



మునస్వామి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం : మండలంలోని కదూరు మాజీ సర్పంచ్ మునస్వామి మరణం బాధాకరమని, ఆయన వైఎస్సార్‌సీపీకి చేసిన సేవలు మరువలేనివని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. గురువారం కదూరు దళితవాడలోని మునస్వామి మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ శివా యాదవ్, నాయకులు గురవయ్య, సుబ్రమణ్యం, నానిరెడ్డి ఉన్నారు.

ముందుకు కదలని మురుగు



కాలువల్లో పేరుకుపోయిన చెత్త

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 21, 22, 23వ వార్డు పరిధిలోని కాలువల్లో కొద్ది రోజులుగా చెత్త పేరుకుపోయింది. ఈ కారణంగా మురుగు రోడ్లపై ప్రవహిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కమిషనర్ ఆదేశించినా పారిశుద్ధ్య సిబ్బంది కదలడంలేదు. రోగాల బారిన పడుతున్నామని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

నారాయణవనం : మండలంలోని 11 సచివాలయాల్లో తిరుపతి స్విమ్స్ వైద్య బృందం ఆధ్వర్యంలో పింక్ బస్సులో నేటి నుంచి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి దర్శిత్ రాజ్ తెలిపారు. రెండు పింక్ బస్సుల ద్వారా పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను మండలంలో ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం తుంబూరు, పాలమంగళం, 20వతేదీ అరణ్యంకండ్రిగ, కీళగరం , 21న కళిమిట్ట, వెంకటకృష్ణ పాలెం , 23న భీమునిచెరువు, నారాయణవనం, 24న ఎరికంబట్టు, నారాయణవనం, 27వతేదీ కొండలచెరువు సచివాలయంలో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని దర్శిత్ రాజ్ కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



ప్రసంగిస్తున్న ఆర్టీసీ డీఎం వెంకటరమణ



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

సత్యవేడు : రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని ఆర్టీసీ డీఎం వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ మనుగడ ఉద్యోగులపై ఆధార పడి ఉందన్నారు. బస్సులు నడపడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నష్టాలను అధిగమించేందుకు ప్రణాళిక, కేటాయించిన వేళల్లో బస్సులు తిప్పాలన్నారు. రహదారిపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. డ్రైవర్లు పూర్తిగా విశ్రాంతి తీసుకొని డ్యూటీకి హాజరు కావాలన్నారు. మానవ తప్పిదాలతోనే 90 శాతం ప్రమాదాలకు దారితీస్తున్నట్లు ఓ అధ్యయనంలో తేలిందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఏఎస్‌ఐ బాలసుబ్రహ్మణ్యం, డిపో ఎస్‌ఎంయూ సెక్రటరీ బాబు, ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ మధుబాబు, పవన్‌కుమార్, శేఖర్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో గురువారం ఘనంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఉండాలన్నారు. మద్యపానం చేసి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎఫ్ చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజరు చిట్టెమ్మ, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం

వరదయ్యపాళెం : మండలంలోని శ్రీహరికోట కాలనీలో నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకును గురువారం స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో రూ. 16 లక్షలతో తాగునీటి అవసరాలకు నూతన హైలెవల్ ట్యాంకును నిర్మించారు. స్థానిక సర్పంచ్ రమణయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించి స్థానిక ప్రజలకు ట్యాంకును అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంఘం నేతలు

శ్రీకాళహస్తి : ప్రభుత్వాలు వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలని ఏక్తా యాంటీ కరప్షన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ కోరారు. ఏక్తా యాంటీ కరప్షన్ జాతీయ సహాయ కార్యదర్శి అబ్దుల్ రెహ్మాన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద వృద్ధులు, సాధువులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలికాలంలో ఎంతో మంది సాధువులు, వృద్ధులు వంతెన మీద నిద్రిస్తూ చలికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ వంత సాయంగా వీరికి కులమతాలకు అతీతంగా దుప్పట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో యాసిన్, అబ్దుల్ కలాం, అన్వర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కాశీనాథ్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న బియ్యపు మధుసూదన్ రెడ్డి

రేణిగుంట : రేణిగుంట మాజీ ఉప సర్పంచి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాశీనాథ్(52), ఏర్పేడు మండలం ఎం.డి పుత్తూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత గున్నేరు రామిరెడ్డి (80), ముసిలిపేడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పునీత్ (32) మృతి చెందడంతో గురువారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మృతదేహాలకు నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు టి.సంధ్యారాణి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, రసూల్, మునిశేఖర్ రెడ్డి, ఏర్పేడు మండల ఇన్‌ఛార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, సర్పంచ్ మోహన ప్రియ, కో ఆప్షన్ సభ్యుడు బత్తి శెట్టి, మాజీ సింగిల్ విండో చైర్మన్ నాగార్జున రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



పునీత్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ముక్కంటి సేవలో అధికారులు



ఆలయం వద్ద విశ్రాంత డీజీపీ ఆర్‌పీ ఠాగూర్

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాష్ట్ర విశ్రాంత డీజీపీ ఆర్‌పీ ఠాగూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే బీహార్ ప్రభుత్వ అదనపు కార్యదర్శి కె.పరశురామయ్య కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

కుర్ర కాలువ.. సమస్యలు కోకొల్లలు



మురుగునీటి కుంట పక్కనే చేతి బోరు



కాలువలు లేక వీధిలో నిలిచిన నీరు

- వీధి కాలువలు లేక ఇక్కట్లు
- మురుగు నీటితో అవస్థ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట మండలం జీపాల్యం పంచాయతీలోని కుర్ర కాలువ హరిజనవాడలో 52 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో బోరు నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా చేస్తుండటంతో నీటి కష్టాలు ఏర్పడుతున్నాయి. తాగునీటి బోరు, మంచి నీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని ప్రజల కోరుతున్నారు. కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లో నుంచి వస్తున్న మురుగు రోడ్లపైకి వస్తోంది. అనేకసార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. హరిజనవాడలోని చేతి బోరు పక్కనే మురుగు నిల్వ ఉండడంతో బోరులో మురుగు నీరు వస్తోందని ఆ నీళ్ల ఇంట్లో వాడుకునేందుకు కూడా పనికి రాకుండా ఉన్నాయని మహిళలు వాపోతున్నారు. భోగి పండుగ వరకు పంచాయతీ బోరు మరమ్మతులకు గురికావడంతో నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ట్యాంకు నిర్మించండి



మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కరెంటు లేదు. మోటారు రిపేర్, పైపులు డ్యామేజ్ అంటూ పంచాయతీ సిబ్బంది నీటి సరఫరా సక్రమంగా చేయడం లేదు. మా హరి జనవాడలోనే నీటి ట్యాంక్ ఉంటే మాకు నీటి కష్టాలు తీరుతాయి.

- పెంచలమ్మ, కుర్రకాలువ హరిజనవాడ

మురుగు నీటితో ఇబ్బందులు



పంచాయతీ నీరు సక్రమంగా రావడం లేదు. మా గ్రామంలో ఉన్న చేతి బోరు పనిచేయకపోవడంతో గ్రామస్తులు చందాలు వేసుకొని చేతి బోరుకు మరమ్మతులు చేయించుకున్నాం. అయినా మురుగు నీరే వస్తోంది. వీధి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

- మునిలక్ష్మమ్మ, కుర్రకాలువ హరిజనవాడ

కొండచుట్టు ఉత్సవం



తుంబూరులో ఉత్సవమూర్తులకు పూజలు

నారాయణవనం : సంక్రాంతి పండుగ సందర్భంగా నగరిలో గురువారం రాత్రి జరిగిన కొండ చుట్టు ఉత్సవానికి మండలంలోని అగస్త్యేశ్వర, పరాశరేశ్వర, తుంబూశ్వర, పాలీశ్వర ఆలయాల ఉత్సవమూర్తులు ఊరేగింపుగా తరలివెళ్లాయి. తొలుత ఉత్సవ మూర్తులు అరుణా నదిలో సందిపు ఉత్సవంలో పాల్గొని నగరి కొండచుట్టు ఉత్సవానికి బయలుదేరాయి. సముదాయం గ్రామ పాడి రైతులు తమ ఆవులను అలంకరించి ఉత్సవర్లకు ఎదురుగా పరిగెత్తించారు. నారాయణవనం కోట వీధులు, కీళగరం, గోవిందప్పనాయుడుకండ్రిగల మీదుగా ఊరేగింపు తుంబూరుకు చేరుకుంది. అప్పటికే పాలమంగళం పాలీశ్వర స్వామి, తుంబూరులోని తుంబీశ్వరస్వామిలతో సందింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు ఆలయాల ఉత్సవర్లు పాలమంగళం, ఎలకాటూరు, ఆరూరు, బుగ్గఅగ్రహారాల మీదుగా సాయంత్రానికి నగరిలో జరిగే కొండచుట్టు ఉత్సవంలో కొలువుదీరాయి. అనంతరం ఉత్సవ మూర్తులు నగరి నుంచి అర్ధరాత్రి దాటాక ఆలయాలకు చేరుకున్నాయి. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్‌ఐ రాజశేఖర్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.